కున్నారు. "ఇందులో పాములేకపోతే నీబుర్ర రామకీర్తనమే" అన్నారు వాడిని. సరేనన్నాడు నూనెగుడ్డలవాడు. వెంటనే వడ్రంగినిపిలిపించి దర్వాజాపడగొట్టించి సీలలు ఊడదీయించేరు. అందులోనుంచి తెల్లనితాచు శల్యావశిష్టమై కొనఊపిరితో పైకివచ్చింది. అప్పు డానూనెగుడ్డలవాడు పళ్లెంలో పాలుపోయించి పాముచేతతాగించేడు. పాముకడుపునిండాతాగి ప్రాణాలుచేరుకున్న తర్వాత బుసకొట్టుకుంటూ పోయింది. అప్పటినుంచీ రామారావుగారికి రోగం తిరుగుముఖమైంది. రోజురోజుకూ ఆరోగ్యవంతులైనారు. ఆనూనెగుడ్డలవాడి మేలు మరిచిపోక వాడిని అప్పుడప్పుడుపిలిచి ఏమయినా యిస్తూండేవారు.

# గణించువారొకరు, గుణించువారింకొకరు

శ్రీమతి సత్యవతీకన్యగారు

ఒక గ్రామములో ఇరువురు బ్రాహ్మణదంపతులుండిరి. వారిద్దరును పొట్టకు, బట్టకు విశేషద్రవ్యము వెచ్చింపగూడదను నియమముగలవారై కడుపునిండ తిండిదినక, శుభ్రమైనబట్టగట్టక వేలకొలది ద్రవ్యమార్జించి తమ యింటిలోనున్న ఒక పెద్దరాతికి కన్నమొనరించి అందులో నాద్రవ్యమంతయు బడవైచి ఆరాతిపై రాత్రింబవళ్లు ఒకరువిడిచి యొకరు పండుకొనుచు అతిజాగరూకతతో మెలంగుచుండెడివారు. వారట్లుకావించుచుండుట ఇంకొక బ్రాహ్మణుడెరింగి ఆరాతిలో ధనముండవచ్చునని యుద్దేశించి ఒకనాటిరాత్రి గూఢముగా వారియింటప్రవేశించి ఒకమూలదాగియుండెను. అంత నాదంపతు లెప్పటివలె నారాతిపైబండుకొని నిదుర బోవసాగిరి. మూలనున్న బ్రాహ్మణుండదియంతయు గనిపెట్టుచు సమయమాలోచించుచుండెను. కొంతవడి కాదంపతులిరువురు నిదురమత్తుచే రాతిపైనుండి కొంచెమొత్తిగిల్లినందున బ్రాహ్మణుండదియే తగినసమయమని యెంచి తానారాతిపై మెల్లగాపండుకొని రాతిమధ్యమున అమర్పబడియున్న మూతనుతీసి అందులోచేయి బెట్టి గుప్పెడురూపాయలు పైకితీయుచుండగా ధనలక్ష్మి ప్రత్యక్షమై వానిచెంపపై నొకదెబ్బకొట్టి ఆరూపాయలు లాగుకొని అందుబడవేసెను. అంత బ్రాహ్మణు డాధనలక్ష్మికాళ్లపైబడి అమ్మా! నేను మిక్కిలిబీద వాడను. రెండుగుప్పెళ్ల ధనమిచ్చినచో నాపిల్లలు, నేనును సుఖముగా బ్రతికెదమని వేడుకొన ధనలక్ష్మి యిట్లనియె: ఓవెఱ్ఱివాడా! ఈధనము వీరిదికాదు. దీనియజమాని పిఠాపురమను గ్రామమున ఒకయుద్యోగివద్ద బట్టలనుతుకుచాకలివాడు. నీవాతనియొద్దకేగి నన్ను ప్రార్థించినరీతి నాతని ప్రార్థించి వానిచే వ్రాలుగల ఒకచీటిని దెచ్చినచో నీవుకోరినధనము బడయగలవని చెప్పిన బ్రాహ్మణుం డామాటల కాశ్చర్యమొంది అమ్మా! నీవు ధనలక్ష్మివైయుండుమని నేదలంచుచున్నాను. కాని నీవాక్యములు నాకు మహాద్భుతములుగానున్నవి. అష్టకష్టములుబడి వీరు సంపాదించిన ద్రవ్యమునకు ఎక్కడనోయున్న రజకుడు యజమానియని నీవిప్పుడు చెప్పిన వాక్యములు సమంజసములుగా దోచుటలేదనివచింప ధనలక్ష్మి ఓబ్రాహ్మణుడా! నేనుచెప్పినదానిలో అబద్ధమేమియులేదు. వీరు సంపాదించిన ధనమంతయు ఆచాకలివానిదగుటచేతనే వీరిందులో నొక్కపైసయైన ఖర్చుపెట్టుటకు శక్తిగవజాలకున్నారు. ఇది లోకస్వభావమే. ఇందులో వింతయెంతమాత్రమును లేదు. నీదీనస్థితి జూడ నాకుమిక్కిలి జాలికలుగుచున్నది. కాని నేనాయదృష్టవంతుని ధనమునీకీయజాలను. కావున నీవాతని యనుజ్ఞవడసిరమ్మని చెప్పుటయు నాతడటనుండి వెంటనే వెడలిపోయి పిఠాపురమునకేగి అచ్చటనొక యుద్యోగియొద్ద నౌకరిచేయు వెంకటేశునిగాంచి యాతని వెనువెంట దిరుగుచుండెను. వెంకటేశు ఆతని చర్యయంతయు జూచి ఈబ్రాహ్మణుం డెవడో నన్నాశ్రయించి తిరుగుచున్నవాడు, నీనివృత్తాంతంబడిగి

తెలుసుకొనవలయునని మనసునందూహించి ఓ బ్రాహ్మణోత్తమా! నీ వెవ్వరవు? నావెంటనిట్లుదిరుగుచుండుటకు కారణంబేమి? నావలన నీకేమిపనికావలయునో ఎఱిగించినచో వెంటనే నెరవేర్పగలనని వచింప బ్రాహ్మణుండిట్లనియె: నాయనా! నీవుమిక్కిలి అదృష్టవంతుడవు. నీసుగుణములు చూచి భాగ్యదేవత నిన్నువరించినది. నీకు మాయూరగల ద్రవ్యరాశిలో నాకు రెండుగుప్పెళ్ల ధనమిప్పింపగలవని పుట్టెడాసతోనే నిచ్చటికరుదెంచితినని వచింప వెంకటేశు బ్రాహ్మణునిమాటలకెంతయు ఆశ్చర్యమొంది అయ్యా! మీవాక్యములత్యద్భుతములుగానున్నవి. నాకేమి! మీయూరధనంబుండుటేమి! నేనదిమీకిప్పించుటేమి? నన్ను ఎగతాళిచేయుట మీవంటివారికి తగునా? అనిపలుక బ్రాహ్మణుండు నేనెంతమాత్రమెగతాళి సేయుటలేదు. నిజముగా నీధనం బచ్చటనున్నది. కావున "రెండుపిడికెళ్లధన మీబ్రాహ్మణున కీయవలయు"నని నీచేవ్రాలుతో ఒకచీటి వ్రాసియిచ్చినచో నేనాధనమును తప్పకపొందగలను. ఎట్లయిన నాకీయుపకారము చేయకున్న నిన్నువిడిచి పోజాలనని నిర్బంధింపమొదలుపెట్ట, వెంకటేశు తన్నాబ్రాహ్మణుడెట్లయిన వదలిపోయిన చాలుననియెంచి అతడుకోరినప్రకారము ఒకకాగితముపై వ్రాసియిచ్చెను. బ్రాహ్మణుడాకాగితము పుచ్చుకొని అత్యంత సంతోషమున తన గ్రామమునకేగి వెనుకటివలె నాటిరాత్రి బ్రాహ్మణదంపతులయింటికేగి ఒకమూలదాగియుండి కొంతసడికి సమయముగనిపెట్టి తాదెచ్చినకాగిత మారాశిలోబడవేసి రెండుపిడికెళ్ల ధనముదీసి బొడ్డుకొంగున గట్టుకొని అంతటితో సంతుష్టిపొందక మఱిరెండు పిడికెళ్ల రూపాయలు తీయుచుండ వెనుకటివలె మఱల ధనలక్ష్మి ప్రత్యక్షమై అతనివీపుపై రెండుదెబ్బలుకొట్టి నీకురెండుగుప్పెళ్లధనమునకు మాత్రమే హక్కుకలదు. అంతకన్న ఒక్కపైసయైన నీవుముట్టుకొనుటకు వీలులేదు. కావున నీ విక నిటనుండి వెడలిపొమ్మని బైటికి గెంటివేసి తానదృశ్యమయ్యెను. బ్రాహ్మణునకు రెండుగుప్పెళ్ల ధనమనుభవించుయోగముండుటచేత గాబోలును ఆదంపతులిరువురు ఈరెండురాత్రులయందును ఒడలెఱుంగకుండ నిదురబోయిరి. ఇట్లుజరిగిన కొన్నిసంవత్సరముల కాదంపతులిరువురు కాలధర్మము నొందుటచే వారియిల్లు శిథిలమయిపోవుటయు, అటుపిమ్మట కొన్నాళ్లకు పిఠాపురమునగల ఉద్యోగి ఈగ్రామమునకువచ్చి కాపురముండుటయు తటస్థించుటచే వానివెంట వెంకటేశుకూడ వచ్చియుండి తనయజమానుని బట్టలుదుకుటకై ఒకరాతిబండ సంపాదింపవలయునని గ్రామమందంతటను దిరుగుచు ఈబ్రాహ్మణుల స్థలములోనున్న రాతినిగనుగొని దానిని గొనితెచ్చి దానిపై బట్టలుదుకుచుండ ఆరాతిమధ్యమున అమర్చబడియున్న మూత క్రమముగ కొన్నాళ్లకు విడిపోవుటచే వాడందుచేయిపెట్టిచూడ తనచేవ్రాలుతోనున్న కాగితమతనికి దొరకెను. అతడదివిప్పి చదువుకొని వెనుకటి వృత్తాంతమంతయు జ్ఞప్తికిదెచ్చుకొని తొల్లి బ్రాహ్మణుడు తన ధనమీగ్రామముననున్నదని చెప్పిన మాట వాస్తవమేయనితలచి ఆద్రవ్యమంతయు దీసుకొని అంతటినుండి నౌకరీవృత్తిమాని ఆధనంబంతయు స్వేచ్ఛగా అనుభవింపసాగెను. ఆహా! గణించువారొకరు, గుణించువారింకొకరనుమాట వాస్తవముగదా.

## లోభి: కొబ్బరికాయ

శ్రీమతి కూచిభొట్ల గంగమ్మగారు

అనగనగా ఒకవూళ్లో ఒకలోభివుండేవాడు. వాడు ఎంతడబ్బు సంపాదించినా ఒక్కకానైనా ఖర్చుపెట్టేవాడుగాదు. ఒకరోజున కార్తికసోమవారంనాడు పెళ్లాము దగ్గరకువచ్చి "ఏమండీ! యింతడబ్బువుంది. కట్టుకుపోతారా? దానధర్మములు చేసుకోవాలిగాని, ఈవేళ అయిన ఒకకొబ్బరికాయ దేవుడికికొట్టండి" అని ఎన్నోసార్లు ప్రాధేయపడిచెప్పింది. పెళ్లాము పోరుపడలేక సరే అని బజారుకు బయలుదేరేడు. కొబ్బరికాయలకొట్టుదగ్గరకువెల్లి

834